

# చేజారిన అదృష్టం

— ఎమ్మెస్.మూర్తి

**హి**మాలయ ప్రాంత అడవులలో సత్యానంద మహర్షి ఉండేవాడు. ఆ మహర్షి ఆశ్రమానికి దగ్గరలో ఉన్న గ్రామంలో సోమయ్య అనే భక్తుడు సపర్యలు చేస్తూ సత్యానందునికి దగ్గరయ్యాడు.

ఒకనాడు సత్యానంద మహర్షి ఏదో పుణ్యక్షేత్రానికి వెడుతూ, "సోమయ్యా! నీవు చేసిన సపర్యలకు సంతుష్టుడినై ఈ మహత్తు గల మణిని నీకు ప్రసాదిస్తున్నాను. ఈ మణికి ఉన్న మహత్తేమిటంటే, ఇనుమును ఈ మణితో తాకినట్లయితే అది బంగార మవుతుంది. కానీ ఒక షరతు.

"నేను రెండు రోజులలో తిరిగి వస్తాను. రాగానే మణిని తిరిగి నా కిచ్చేయాలి. ఈలోగా , నీవు ధనవంతుడివై భవిష్య జీవితాన్ని హాయిగా గడుపు!" అని సత్యానందుడు ఆ మణిని సోమయ్యకి ఇచ్చి పుణ్యతీర్థానికి వెళ్లాడు.

భోగభాగ్యాలు తనకు లభించనున్నాయని సోమయ్య చాలా ఆనందించాడు. ఆశ్రమం నుండి ఇంటికి వెళ్తూ 'రెండు రోజులు గడువు ఉంది కదా! పట్నానికి వెళ్లి పెద్ద ఇనుప దూలాలు తీసుకువచ్చి బంగారంగా మారిస్తే — ఇక జీవితాంతం ఏ బాధా ఉండదు. ఈ రోజుకి విశ్రాంతి తీసుకుంటాను' అనుకున్నాడు సోమయ్య. మర్నాడు ఉదయం పట్టణానికి వెళ్లి, ఇనుప సామానులు అమ్మే దుకాణంలో పెద్ద పెద్ద దూలాలు నాలుగు బేరమాడి, వాటి ధర చెల్లించాడు. మధ్యాహ్న భోజన సమయమవటం వలన ఆ దూలాలు సోమయ్య ఇంటికి చేర్చటానికి కుదరలేదు. సోమయ్య కూడా మధ్యాహ్న భోజనం చేసి, భుక్తాయాసంతో ఒక చెట్టుకింద నడుంవాల్చాడు. మెలకువ వచ్చేసరికి చీకట్లు కమ్ముకున్నాయి. పరుగు పరుగున దుకాణానికి వెళ్లాడు. కానీ అప్పటికే దుకాణం మూసివేశారు.

రెండు రోజులు గడువు అయిపోయింది. సత్యానంద మహర్షి తిరిగి ఆశ్రమానికి వచ్చాడు. సోమయ్య ఆ మహర్షి పాదాల మీద పడి, "స్వామీ! నాకు ఇంకొక్క రోజు గడువు ఇవ్వండి, చాలు!" అని వేడుకున్నాడు.

"భక్తా! నీవు సోమరివై, దురాశతో ప్రవర్తించావు. నీ గృహంలో ఉన్న ఇనుప వస్తువులను బంగారంగా మార్చవచ్చు కదా! దురాశతో పెద్ద మొత్తంలో బంగారం సంపాదిద్దా మనుకున్నావు. అలా చేయటానికి కూడా నీకు రెండు రోజులు గడువిచ్చినా, పనిని వాయిదాలతోనే సరిపెట్టుకున్నావు. అదృష్ట మనేది ఎప్పుడూ రాదు. ఏ రోజు చేయవలసిన పనిని ఆ రోజే చేయాలి!" అని సత్యానంద మహర్షి సోమరులుండే ప్రదేశంలో ఉండటం ఇష్టం లేక ఆ ఆశ్రమాన్ని వదిలి వెళ్లిపోయాడు. ●

---

## నావ



అది గదిగో
ఒక్క నావ
ఆ నదిలో
పోతున్నది !

అందంగా
అలలపైన
భలే భలే
కదులుతోంది !

తరుల మధ్య
గిరుల మధ్య
తళతళమని
మెరుస్తోంది !

తామరలతో
మీనములతో
కలిసి మెలిసి
ఆడుతోంది !

గొల్లాపిన్ని సుబ్రహ్మణ్య శర్మ

---

## మన పురాణ పురుషులు

**ఆరుణి :**

పాంచాల నగరవాసి, ధౌమ్యుడి శిష్యుడూను. ఒకసారి గురువు ధౌమ్యుడు ఆరుణిని చేలల్లో కట్టలు కట్టి నీటిని ఆపమన్నాడు. ఎన్నిసార్లు ప్రయత్నించినా నీటి ప్రవాహాన్ని ఆపలేక చివరికి తానే కట్టగా పడుకుండిపోయాడు. తరువాత ధౌమ్యుడు విషయం తెలుసుకుని, చేలల్లోకి వెళ్లి ఆరుణిని పేరుపెట్టి పిలిచాడు. కట్ట తెగి ఆరుణి బయటకు వస్తాడు. ఆ కారణంగా ఆరుణికి ఉద్దాలకుడు అన్న పేరు వచ్చింది.